క్లుప్తంగా

సహాయక చర్యలను పరిశీలించిన డీఎస్పీ, సీఐ



సహాయక చర్యలను పరిశీలిస్తున్న పోలీసులు

అర్వపల్లి: భారీ వర్షాల మూలంగా అర్వపల్లిలో విద్యాలయాలు, ఇళ్లు జలమయమై ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఆదివారం సూర్యాపేట డీఎస్పీ రవి, నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, స్థానిక ఎస్‌ఐ సీహెచ్‌.బాలకృష్ణలు సహాయక చర్యలు చేపట్టారు. ఇళ్లలో నీళ్లు నిలిచిన వారిని అప్రమత్తం చేశారు. నీళ్లు చెరువులోకి వెళ్లిపోయేలా పనులను దగ్గరుండి చేయించారు. కార్యక్రమంలో బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌ రెడ్డి, బైరబోయిన మహరాజు, సైదులు, మాజీ ఉపసర్పంచ్‌ పులిచర్ల ప్రభాకర్‌ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



ఆలయం వద్ద భక్తుల సందడి

పెన్‌పహాడ్‌: మండల పరిధిలోని అనంతారం, లింగాల గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు సాంప్రదాయ బద్ధంగా బోనం ఎత్తుకొని డప్పు చప్పుళ్ల మధ్య ఊర ముత్యాలమ్మ తల్లి దేవాలయం వద్దకు చేరుకున్నారు. ముత్యాలమ్మ తల్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

4న కలెక్టరేట్‌ ఎదుట నిరసన దీక్ష

సూర్యాపేట: ఎస్సీ, ఎస్టీ వర్గాలను వర్గీకరణ చేయాలనే మనువాద పార్టీల కుట్రలకు వ్యతిరేకంగా మాలలు సెప్టెంబర్‌ 4న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్‌ కార్యాలయాల ఎదుట నిరసన దీక్షలు చేపట్టాలని ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేక పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కో కన్వీనర్‌, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్‌ కోరారు. 19న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేపట్టాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి

పెన్‌పహాడ్‌: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల పరిధిలోని భక్తాళాపురం గ్రామంలో వరదలకు నష్టపోయిన పొలాలను పరిశీలించి మాట్లాడారు. మండలంలో పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు వర్షం తాకిడికి కొట్టుకుపోయాయని, రాక పోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. వరదకు కొట్టుకుపోయిన పొలాలకు ఎకరానికి రూ. 25వేలు, కూలిపోయిన ఇండ్లకు రూ. 10లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నెమ్మాది అడివయ్య, వీరయ్య, గోపాల్దాసు శ్రీరాములు, పసుపులేటి రమేష్‌, ఇరుగు రమేష్‌, పాల్గొన్నారు.

ఆటో ఢీకొని గాయాలు

పెన్‌పహాడ్‌: ఆటో ఢీకొని ఒకరికి తీవ్ర మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన పెన్‌పహాడ్‌ మండల పరిధిలోని అనంతారం గ్రామ శివారులోని ఈద్గా వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ..అనంతారం గ్రామానికి చెందిన సామ శ్రీనివాస్‌రెడ్డి తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా అనాజిపురం గ్రామం వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలుకాగా.. ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

విజ్ఞానాన్ని అందించేందుకు కృషి

సూర్యాపేటటౌన్‌ : ప్రజలకు విజ్ఞానాన్ని అందించే వేదికగా జన విజ్ఞాన వేదిక ఎంతగానో కృషి చేస్తుందని జేవీవీ రాష్ట్ర సెక్రటేరియట్‌ మెంబర్‌ డాక్టర్‌ అందె సత్యం తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో నిర్వహించిన జన విజ్ఞాన వేదిక 5వ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్‌ విజయమోహన్‌, డి.ఎస్‌. స్వామి, మేకల వెంకట్రావు, అధ్యక్షుడిగా రమేష్‌బాబు, కార్యదర్శులుగా ఎస్‌ ఆంజనేయులు, అబ్దుల్‌ భాష, సాలేహబేగం, ఆంజనేయులు, యాదగిరి, నాగరాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు తల్లాడ రామచంద్రయ్య, దయానంద్‌ పాల్గొన్నారు.

వర్షపు నీరు తొలగింపు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణ మున్సిపల్‌ పరిధిలోని 21వ వార్డులో భారీ వర్షాల కారణంగా ప్రజల ఇంటిలోకి వరద నీరు చేరడంతో వార్డు కౌన్సిలర్‌ పోలగాని కవితబాలుగౌడ్‌ స్పందించి ఆర్డీఓ, తహసీల్దార్‌, ఇరిగేషన్‌ అధికారులకు విషయం తెలిజేశారు. ఆదివారం స్పందించిన అధికారులు ఆ నీటిని తొలగింపజేశారు. స్పందించిన అధికారులకు కౌన్సిలర్‌ ధన్యవాదాలు తెలిపారు.

వాన.. స్తంభించిన జనజీవనం

- బీమారం–మిర్యాలగూడ మధ్య రాకపోకలకు అంతరాయం
- సూర్యాపేట–జనగామ రహదారిపై నిలిచిన రాకపోకలు
- పలు చోట్ల నీటమునిగిన వరిపొలాలు



సూర్యాపేట : రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న కాసరబాద వాగు



నెమ్మికల్‌ దండుమైసమ్మ ఆలయం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

సూర్యాపేట రూరల్‌ : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సూర్యాపేట మండల వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు నిండి అలుగులు పోస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పంట పొలాలు, మెట్ట పంటల్లోకి నీళ్లు చేరాయి. మూసీ ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువ నీళ్లు విడుదల చేయడంతో పిల్లలమర్రి, పిన్నాయిపాలెం గ్రామాల మధ్య ఉన్న కాలువకు గండి పడింది. దీంతో సంబంధిత ఇరిగేషన్‌, రెవెన్యూ అధికారులు తహసీల్దార్‌ శ్యాంసుందర్‌రెడ్డి, డీఈ చంద్రశేఖర్‌, ఏఈ స్వప్నలు అక్కడికి చేరుకుని మూసీ కాలువ గండి పూడ్చి మరమ్మతులు చేశారు. భారీ వర్షంతో కుసుమవారిగూడెం వద్ద ఉన్న వాగు పొంగి పొర్లడంతో బీమారం–మిర్యాలగూడ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాసరబాద వాగు ఉధృతంగా రావడంతో గ్రామంలోని ప్రజలు సూర్యాపేటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. యర్కారం, రామారం చెరువులు నిండడంతో చెరువులు అలుగులు పోస్తున్నాయి. గాంధీనగర్‌ వద్ద వాగు ప్రవహిస్తుండడంతో యువకులు సంతోషంగా చేపలు పడుతున్నారు. మూడు రోజుల భారీ వర్షం కారణంగా సూర్యాపేట మండలంలో ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగలేదు.

నీట మునిగిన వరిపొలాలు

చివ్వెంల(సూర్యాపేట) : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరిపొలాలు నీట మునిగాయి. పలు చోట్ల చెట్లు , విద్యుత్‌ స్తంభాలు నెలకొరిగాయి. మండల కేంద్రంలో పలుఇళ్లలోకి నీరు చేరాయి. అదే విధంగా గ్రామంలో ఉన్న చర్చిలోకి వరద నీరు చేరి కుంటను తలపిస్తుంది. మండల కేంద్రం నుంచి పాశ్యానాయక్‌ తండాకు వెళ్లు రహదారిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుంది. వట్టిఖమ్మంపహాడ్‌ గ్రామంలో పంట పొలాలు నీట మునిగిపోయాయి. మండల కేంద్రం నుంచి వాల్యతండ, జగనాతండాకు వెళ్లు రహదారిపై నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అన్ని గ్రామాల్లో చెరువులు నిండి నిండు కుండగా దర్శనమిస్తున్నారు. అలుగు పోస్తుండంతో ఆయా గ్రామాల ప్రజలు వలలతో చేపలు పట్టుటకు ప్రయత్నిస్తున్నారు. గ్రామాల్లో పాత ఇళ్లు ఉంటే అందులో ఉండవద్దని ఇప్పటికే అధికారులు గ్రామాలో టామ్‌టామ్‌ వేయించారు. చెవవులు అలుగులు పోస్తుండటంతో పంట పొలాలపై వరద నీరు ప్రవహిస్తుంది, దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తిరుమలగిరిలో భారీ వర్షం

తిరుమలగిరి (తుంగతుర్తి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం వల్ల తిరుమలగిరి మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం 11 గంటల వరకు భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి మండలంలోని అన్ని చెరువులు, కుంటలు అలుగు పోస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వివిధ గ్రామాల్లో భారీ వర్షానికి వరి పొలాలు, పత్తి చేన్లన్నీ మునిగి పోయాయి. సూర్యాపేట–జనగామ ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో వాహనాలకు గంట పాటు తీవ్ర అంతరాయం కలిగింది. సంఘటనా స్థలాన్ని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ శాగంటి అనసూయ రాములు, తహసీల్దార్‌ జాన్‌ మహ్మద్‌, ఎస్‌ఐ సురేష్‌ సందర్శించి జేసీబీలతో వరద నీరు పోయే విధంగా రంధ్రాలు చేపించారు. సుమారు గంట సేపు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

చింతలకుంట తండాలో భారీ వర్షం

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మండలం చింతలకుంట గ్రామ పంచాయతీ తండాలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి పాత ఇండ్లలో భారీగా నీరు చేరడంతో ముందస్తుగా 8 కుటుంబాలను ఆవాస ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ లాజర్‌, ఎంపీఓ భీంసింగ్‌ కుటుంబ సభ్యులకు ఆహార పదార్థాలను అందించారు.

చెరువులు మత్తడి

ఆత్మకూర్‌ (ఎస్‌)(సూర్యాపేట) : తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండల వ్యాప్తంగా చెరువులు కుంటలు అలుగులు పోస్తున్నాయి. శనివారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో మండల వ్యాప్తంగా అన్ని చెరువులు అలుగులు పోయడంతో పాటు అలుగుకింది వీధులు ఇండ్లు నీటితో మునిగిపోయాయి. ఒకేసారి వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రం ఆత్మకూర్‌ – నెమ్మికల్‌ మధ్య పెద్ద చెరువుకు వచ్చే వాగు ఉధృతంగా రోడ్డుపై నుంచి రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. భీముని కుంట అలుగు అలాగే ఉండగా గ్రామానికి – ఎక్స్‌రోడ్డు మధ్య కొద్దిసేపు రాకపోకలు బంద్‌ అయ్యాయి. వరద ప్రభావంతో దుబ్బగూడంలోని ఇళ్లల్లోకి మోకాళ్లకు పైగా నీరు వచ్చింది. దీంతో ఆయా ఇండ్లలో బియ్యం, బట్టలు తదితర వస్తువులు తడిసి ముద్దయ్యాయి. నెమ్మికల్‌ చౌట చెరువు అలుగుతో దండు మైసమ్మ వద్ద రోడ్డుపై ప్రవహించడంతో మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిపివేశారు. అదే విధంగా ఏపూరు వద్ద బిక్కేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జి పై నుండి మూడు ఫీట్లకు పైగా పారడంతో ఏపూరితో పక్క గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రంలో మోడల్‌ స్కూల్‌ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో నీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోడల్‌ స్కూల్లో విద్యార్థులకు మధ్యాహ్న వరకు టిఫిన్‌ పెట్టకపోవడంతో విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడ్డారు. మండల కేంద్రంలో ఇళ్లలోకి నీరు చేరిన ప్రాంతాన్ని మండల తహశీల్దారు వినోద్‌ కుమార్‌, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు కాకి కృపాకర్‌రెడ్డి పరిశీలించారు. శిధిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివసించవద్దని పలువురిని పునరావాస కేంద్రాలకు తరలించారు. కాగా నిన్నటి వరకు చెరువులు నీళ్లు లేక ఎస్సారెస్పీ కాలువ నీళ్లు రాకపోవడంతో ఆందోళనకు గురైన రైతులు చెరువులు ఉండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మద్దిరాల : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జన జీవనం స్తంభించి పోయింది. వర్షానికి మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో మేడ భిక్షం ఇల్లు కూలిపోయింది. చందుపట్ల గ్రామానికి పెద్ద చెరువు కట్ట తెగి పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని అన్ని గ్రామాల చెరువులన్ని ఉధృతంగా అలుగులు పోస్తున్నాయి.దీంతో మండల తహసీల్దార్‌ అమీన్‌సింగ్‌,ఎస్‌ఐ వీరన్న ఎప్పటికప్పుడు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ఎవరు కూడా ఇంటి నుండి బయటికి రావొద్దని,చేపల వేటకు వెళ్లొదని సూచించారు.

తిమ్మాపురం–సంగెం రూట్లో నిలిచిన రాకపోకలు

అర్వపల్లి: భారీ వర్షాల మూలంగా అర్వపల్లి అతలాకుతలమైంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అర్వపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జెడ్పీహెచ్‌ఎస్‌, సంత వీధి, ఉమామహేశ్వరస్వామి దేవాలయంరోడ్డు, పోలీస్‌స్టేషన్‌రోడ్‌, జాజిరెడ్డిగూడెంరోడ్‌లు జలమయమయ్యాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కోడూరు వాగు పొంగి ప్రవహించడంతో తిమ్మాపురం–సంగెం రూట్లో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే అర్వపల్లిలోని పశువైద్యశాల నీటితో నిండిపోయింది. స్థానికంగా 365బీ హైవే సముద్రంలా మారింది. స్థానికంగా సుమారు 30కి పైగానే ఇళ్లలో నీళ్లు నిలిచాయి.



సూర్యాపేట : సుందరయ్య నగర్‌లో జలమయమైన వీధులు



ఎస్వీ కళాశాల వద్ద పర్యటిస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



పసునూర్‌లో అలుగుపోస్తున్న పెద్ద చెరువు



తిరుమలగిరి : వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలోకి చేరిన వర్షపు నీరు



నూతన్‌కల్‌ : దంతాలపల్లి–సూర్యాపేట రోడ్డుపై గుండ్లసింగారం బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



అర్వపల్లి కేజీబీవీలోకి చేరిన వర్షపు నీరు



చివ్వెంల : వట్టిఖమ్మపహాడ్‌లో నీట మునిగిన వరిపొలాలు



తిరుమలగిరి : నీట మునిగిన వరిపొలాలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పసునూర్‌లో పెద్ద చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్‌

తుంగతుర్తి : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్‌ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో వర్షాలతో సుమారు 672 కుంటలు, చెరువులు నిండి అలుగు పోస్తున్నాయని తెలిపారు. ఈ నీటితో సుమారుగా 1.50లక్షల ఎకరాల పంటలకు నీరు ఉపయోగపడుతుందన్నారు. ప్రకృతి కరుణించడం గొప్ప విషయమని, ఒక పక్క కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా రూ.18వేల కోట్లు రుణమాఫీ చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆక్రమణలకు గురైన చెరువులను, కుంటలను రక్షిస్తుందని, అందులో భాగంగా హైదరాబాద్‌లో హైడ్రాతో అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చుతుందన్నారు. త్వరలో తుంగతుర్తి నియోజకవర్గంలో కూడా చెరువులకు సంబంధించిన భూముల్లో అక్రమ నిర్మాణాలు ఉంటే వాటిని గుర్తించి తొలగిస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్‌, జిల్లా మహిళ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్‌రావు, మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్‌, డీసీసీబీ డైరెక్టర్‌ గుడిపాటి సైదులు, ఓరుగంటి సత్యనారాయణ, సుంకరి జనార్ధన్‌, రాంబాబు, పాల్గొన్నారు.

నాగారం : రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పసునూర్‌ గ్రామంలో వర్షాలకు నిండి అలుగు పోస్తున్న చెరువును పరిశీలించి మాట్లాడారు. ప్రజలు అవసరమైతే తప్ప ఇళ్లల్లో నుంచి బయటికి రావొద్దని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, నాయకులు సుంకరి జనార్దన్‌, బైరబోయిన మహారాజు, బుక్క అంజయ్య, బుక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ విధానాన్ని అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న టీజీఈజేఏసీ నాయకులు

సూర్యాపేటటౌన్‌ : సీపీఎస్‌ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్‌ యాక్షన్‌ కమిటీ నాయకులు డిమాండ్‌ చేశారు. ఆదివారం టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్‌ 1 పెన్షన్‌ విద్రోహ దినంగా పాటిస్తూ జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కంట్రిబ్యూటరి పెన్షన్‌ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇటీవల యూనిఫైడ్‌ పెన్షన్‌ విధానాన్ని తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆలోచన విధానాన్ని లక్షలాదిగా పనిచేస్తున్న ఉద్యోగుల పక్షాన వ్యతిరేకిస్తున్నామన్నారు. 2004 సెప్టెంబర్‌ 1 కి ముందు అందరూ ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్‌ విధానం అమలులో ఉందని, ఈ విధానంలో ఉద్యోగి రిటైర్‌ అయినప్పుడు ఉన్న చివరి వేతనం 50శాతం పెన్షన్‌ రూపంలో ఉద్యోగికి చెల్లించే వారన్నారు. అయితే పెరుగుతున్న సగటు ఆయుప్రమాణం, పెరుగుతున్న ఉద్యోగుల సంఖ్య, వేతనాలు దృష్ట్యా ప్రభుత్వం ఈ పెన్షన్‌ భారాన్ని తగ్గించుకునేందుకు కొత్త పెన్షన్‌ విధానాన్ని అమల్లోకి తెచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె.జానిమియా, డా.బి.గోపి, శ్యామ్‌, చంద్రశేఖర్‌, చింత రెడ్డి రామలింగారెడ్డి, తంగేళ్ల జితేందర్‌ రెడ్డి, లక్కపాక ప్రవీణ్‌, సోంబాబు, రేపాక లింగయ్య, వెంకటేశ్వర్లు, మట్టపల్లి రాధాకృష్ణ, గుణగంటి కృష్ణ పాల్గొన్నారు.

కేజీబీవీ బాలికలకు ప్రత్యేక వైద్యశిబిరం



విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్‌ మణిదీప్‌

అర్వపల్లి: భారీ వర్షాల కారణంగా అర్వపల్లిలోని కేజీబీవీ రెండు రోజులుగా జలదిగ్బంధంలో ఉంది. దీంతో ఆదివారం అధికారులు బాలికలను బయటకు తీసుకొచ్చి స్థానిక ఫంక్షన్‌హాల్‌లో వసతి కల్పించారు. అయితే స్థానిక మండల వైద్యాధికారి డాక్టర్‌ మణిదీప్‌ ఫంక్షన్‌హాల్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్‌, ఎస్‌ఓ నాగరాణి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

సూర్యాపేట : మాజీ మున్సిపల్‌ కమిషనర్‌ గండూరి ప్రవళిక్రప్రకాష్‌ పెద్ద కుమారుడు గండూరి ప్రీతం జోస నాలుగో వర్ధంతి సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేషన్‌ డీలర్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షులు చక్రహరి నాగరాజు, బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకులు మోత్కూరి సందీప్‌, రాచకొండ కృష్ణ, ఎలుగురి రామ్మూర్తి, గుడిసె శేఖర్‌, హరీష్‌, రంజిత్‌, నరేష్‌, యూత్‌ నాయకులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక

తిరుమలగిరి : పీఆర్‌టీయూ (టీఎస్‌) నూతన మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కసిరెడ్డి అశోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భూక్యా లక్ష్మణ్‌, అసోసియేట్‌ అధ్యక్షుడగా సి.హెచ్‌.యాదగిరి, కార్యదర్శిగా బానోతు సుందర్‌, మహిళా ఉపాధ్యక్షురాలిగా బి.పద్మావతి, మహిళా కార్యదర్శిగా కె.వెంకటరమణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జె.చంద్రశేఖర్‌, పి.జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో పూజలు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆతర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్‌, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్‌, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు రామశర్మ పాల్గొన్నారు.

వర్ష బీభత్సం.. అతలాకుతలం



వెంపటిలో వర్షానికి కూలిన ఇల్లు



పెన్‌పహాడ్‌ : అనంతారం గ్రామ శివారులో కూలిన వృక్షాలు

పెన్‌పహాడ్‌: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండి అలుగు పోస్తున్నాయి. ఆదివారం మండల పరిధిలోని చీదెళ్ల, దోసపహాడ్‌ తదితర గ్రామాల్లో స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. దీంతో ట్రాన్స్‌కో అధికారులు స్పందించి స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. అనంతారం–పొట్లపహాడ్‌ గ్రామాల మధ్య రహదారిపై వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతారం, పొట్లపహాడ్‌ గ్రామాల్లో రెండు ఇండ్లు దెబ్బతిన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఎడతెరిపి లేని వర్షం

నూతనకల్‌ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండి అలుగు పోస్తున్నాయి. ఆదివారం మండలంలో పలు రహదారులపై రాకపోకలు నిల్వడంతో పాటు పలు గ్రామాల్లో వర్షపు నీరు ఇండ్లలోకి చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో ముత్యాలమ్మ కుంట కట్ట తెగడంతో వరద నీరు ఇండ్లలోకి ప్రవేశించడంతో 40ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది. గ్రామానికి చెందిన చిర్ర ఉప్పలయ్య ఇంటిలో నిల్వ ఉంచిన 8బస్తాల పెసళ్లు, 3క్వింటాల బియ్యం వరద నీటిలో కొట్టుకుపోయాయి. కొంపెల్లి పిచ్చయ్య ఇల్లు నేలమట్టమైంది. గుండ్లసింగారం శివారులోని సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై పాలేరు వాగు ఉధృతికి వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

నిండుకుండలా చెరువులు, కుంటలు

నాగారం : రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు అలుగులు పోస్తూ నిండుకుండలను తలపిస్తున్నాయి. మండలంలోని పసునూర్‌, పస్తాల, లక్ష్మాపురం, వర్ధమానుకోట, నాగారం, డి.కొత్తపల్లి, ఈటూరు గ్రామాల్లోని చెరువులు నీటితో నిండి ఉధృతంగా అలుగులు పోస్తున్నాయి. అలాగే పస్తాల, లక్ష్మాపురం, డి.కొత్తపల్లి గ్రామాల్లో ఉన్న బంధంల వద్ద(కల్వర్టులు) ప్రమాదకంగా నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు రాకపోకలను నిలిపివేయించారు. నాగారం–తుంగతుర్తి ప్రధాన రహదారిపై చెట్లు కూలడంతో రాకపోలకు ఇబ్బందులు కలిగాయి. మరి కొన్ని గ్రామాల్లో వర్షానికి విద్యుత్‌ అంతరాయం ఏర్పడింది.



మద్దిరాల: వరద తీవ్రతను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్‌, ఎస్‌ఐ వీరన్న

అలుగుపారుతున్న చెరువులు, కుంటలు

తుంగతుర్తి : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు, కుంటలు, చెరువులు అలుగుపోస్తున్నాయి. మండల పరిధిలోని కొత్తగూడెంలో భారీ వర్షానికి ఊరు వెంట ఉన్న కొత్తకుంట నిండి ఎస్సీకాలనీలోకి వరద నీరు వచ్చింది. ఇండ్లు, వీధులు జలమయంగా మారాయి. కాంగ్రెస్‌ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధకిషన్‌రావులు గ్రామంలోని పరిస్థితిని తహసీల్దార్‌, ఎంపీడీఓ, పోలీసులకు, ఇరిగేషన్‌ అధికారులు తెలియజేశారు. తహసీల్దార్‌ కంఠమయ్య, ఎంపీడీఓ శేషుకుమార్‌, సీఐ శ్రీనునాయక్‌, ఎస్‌ఐ ఏడుకొండలు గ్రామానికి చేరుకొని వెంటనే జేసీబీ సహాయంతో చెరువుల అలుగు వద్ద ఉన్న రాళ్లను తొలగించి, కాలనీలోకి చేరిన నీరు తగ్గే విధంగా చేశారు. అలాగే వెలుగుపల్లిలోని రుద్రమాదేవి చెరువు, గానుగుబండ, తూర్పుగూడెం, తుంగతుర్తి, అన్నారంలో తదితర గ్రామాల్లోని చెరువులు, కుంటలు వర్షాలకు నిండి అలుగులు పోస్తున్నాయి. వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



తుంగతుర్తి : ఇళ్లలోకి చేరిన వరదనీరు



మద్దిరాలలో వర్షానికి కూలిన ఇల్లు